janodaya
RNI No - APTEL/2022/81596

# జనోదయ

కరీంనగర్ మంగళవారం 07.04.2026 సంపుటి:03 సంచిక:121 పేజీలు:08 వెల : 05
Karimnagar Tuesday 07.04.2026 Volume : 03 Issue : 121 Pages : 08 Cost : 05

తెలుగు దినపత్రిక




# 2027మార్చి తర్వాతే జిల్లాల పునర్వ్యవస్థీకరణ – సీఎం రేవంత్ స్పష్టం

## రాష్ట్రంలో మళ్లీ గడీల, రాక్షసులపాలన రానివ్వం

## బీఆర్ఎస్ , బీజేపీ మాకు శత్రువులు కాదు:సీఎం రేవంత్ రెడ్డి

**జనోదయ హైదరాబాద్ ఏప్రిల్ 06 :**

జిల్లాల పునర్వ్యవస్థీకరణపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. 2027 మార్చి 31 తర్వాత మాత్రమే జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపడతామని స్పష్టం చేశారు. అప్పటివరకు మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల సరిహద్దుల్లో ఎలాంటి మార్పులు చేయొద్దని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు.

ఆ గడువు పూర్తైన తర్వాత ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసి, బోథ్ ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలనే డిమాండ్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇలాంటి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

పిప్రి, ఇంద్రవెల్లి ప్రాంతాల నుంచి ప్రజా ప్రభుత్వం వస్తుందని అప్పుడే చెప్పామని, అదే నిజమైందని సీఎం పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా తమ ప్రభుత్వమే తిరిగి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మళ్లీ గడీల పాలనకు అవకాశం ఇవ్వబోమని, 2034 వరకు తమ ప్రభుత్వమే కొనసాగుతుందని తెలిపారు.

రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, ఆ తర్వాత అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**ఆదిలాబాద్ అభివృద్ధిపై సీఎం రేవంత్ దృష్టి – రూ.695 కోట్ల పనులకు శ్రీకారం**

ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సుమారు 1400 కి.మీ పాదయాత్రలో ప్రజలు ఇచ్చిన మద్దతుతోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ ప్రజలు అమాయకులు కాదని, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వీరులని కొనియాడారు.

బీజేపీ, బీఆర్ఎస్ తమకు శత్రువులు కాదని, ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితం అవుతాయని, ఆ తర్వాత అభివృద్ధి కోసం అన్ని పార్టీలతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో ఏర్పడిన సమస్యలు, అప్పులను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులపై విమర్శలు రావడం విచారకరమని అన్నారు.

ఆరు గ్యారంటీల అమలుపై అసెంబ్లీలో చర్చకు రావాలని కోరినా బీఆర్ఎస్ నేతలు ముందుకు రావడం లేదని విమర్శించారు. గతంలో ప్రజల ఫోన్లు ట్యాప్ చేశారని ఆరోపిస్తూ, ప్రస్తుతం మాత్రం ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని తెలిపారు. జూన్ 2లోపు మళ్లీ ఆదిలాబాద్ వస్తానని హామీ ఇచ్చారు. 2030 నాటికి ఆదిలాబాద్‌ను పర్యాటక, పారిశ్రామిక, విద్యా కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ప్రతిపక్షాలకు కూడా చట్టసభల్లో మాట్లాడే అవకాశాన్ని కల్పిస్తున్నామని సీఎం తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపీలకు వేదిక ఇస్తున్నామని చెప్పారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతాలకూ సమానంగా నిధులు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. బోథ్, నిర్మల్ నియోజకవర్గాల్లో తమ ఎమ్మెల్యేలు లేకపోయినా అభివృద్ధి ఆగలేదని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇప్పటికే రూ.5,400 కోట్లు పేదల ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. త్వరలోనే తుమ్మిడిహెట్టి నుంచి ప్రాణహిత ప్రాజెక్టును పునఃప్రారంభిస్తామని ప్రకటించారు. ఆదిలాబాద్‌కు నీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడం తమ లక్ష్యమని తెలిపారు.





# హోర్ముజ్ తెరవాల్సిందే.. డెడ్లైన్ పొడిగింపు లేదు: ట్రంప్ హెచ్చరిక : ఈ రాత్రే నాశనం చేస్తా

**జనోదయ ఏప్రిల్ 06 :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌కు విధించిన మంగళవారం డెడ్లైన్‌ను ఇక పై పొడిగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అవసరమైతే ఒక్క రాత్రిలోనే ఇరాన్‌ను ధ్వంసం చేసే ఆపరేషన్‌కు సిద్ధమని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య సీజ్‌ఫైర్ చర్చలు విఫలమయ్యాయని తెలిపారు.

ఇరాన్‌కు పలుమార్లు వెనక్కు తగ్గే అవకాశాలు ఇచ్చినా వినియోగించుకోలేదని, అందుకే దాడులు మళ్లీ ప్రారంభించాల్సి వచ్చిందన్నారు. ఇరాన్ అణ్వాయుధాల అభివృద్ధిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ట్రంప్ స్పష్టం చేశారు. యుద్ధం కొనసాగితే ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు.

ఇరాన్ ప్రభుత్వం ప్రజలపై దాడులు చేస్తోందని ఆరోపిస్తూ, అక్కడి ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. అయితే ఇది ప్రమాదకరమని కూడా హెచ్చరించారు. మరోవైపు, యూఎస్ దళాలు చేపట్టిన రిస్క్యూ ఆపరేషన్‌ను ట్రంప్ ప్రశంసించారు. ఎఫ్-15 విమానం నుంచి తప్పించుకున్న పైలట్‌ను రక్షించడం చరిత్రాత్మకమని తెలిపారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సమాచారం లీక్ కావడంపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే మీడియా సంస్థలపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




# కవల బాలికల హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్టు



**జనోదయ కరీంనగర్ ఏప్రిల్ 06 :**

కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్‌లో జరిగిన కవల బాలికల హత్య కేసులో తండ్రితో సహా నలుగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీపీ గౌష్ ఆలం వివరాలు వెల్లడించారు. సీపీ వివరాల ప్రకారం.. "జూబ్లీనగర్‌కు చెందిన శ్రీశైలం-మౌనిక దంపతులకు 2022లో ఇద్దరు కవల బాలికలు జన్మించారు. వారికి గీతాంశి, గీతాన్విక అని పేరు పెట్టారు. మౌనిక గర్భధారణ సమయంలో కవల ఆడపిల్లలు అని తెలిసి గర్భస్రావం చేయించాలని శ్రీశైలం ప్రయత్నించగా ఆమె ఒప్పుకోలేదు. అతని తండ్రి అశోక్, తల్లి లావణ్య, తమ్ముడు రాకేష్‌లు గర్భస్రావం చేయించుకోవాలని బెదిరించారు. బాలికలు జన్మించిన తరువాత ఆసుపత్రిలో దగ్గరకు కూడా తీసుకోలేదు. ఈ విషయంలో భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఆడపిల్లలు పెద్దయ్యాక పెళ్లిళ్ల సమయంలో రూ.2 కోట్ల ఆస్తి పోతుందని, కుటుంబ సభ్యులు హత్యకు పథకం రచించారు. తమ బంధువుల ఇంట్లో పట్నాలు ఉండగా, ముగ్గురు నిందితులు అక్కడికి వెళ్లారు. బాలికల తండ్రి శ్రీశైలం తన మేనబావ ద్విచక్రవాహనాన్ని తీసుకొని గ్రామానికి వచ్చాడు. భార్యను ఇంటి వద్ద ఉండమని కుమార్తెలను ద్విచక్రవాహనంపై పొలం వద్దకు తీసుకెళ్లాడు. చిన్నారులు ఆడుకుంటుండగా బావిలోకి తోసేశాడు. గీతాన్విక మునిగిపోగా, గీతాంశి కాళ్లు, చేతులు ఆడించింది. శ్రీశైలం బావిలోకి దిగి ఆమెను ముంచాడు. వారు ఆడుకుంటూ బావిలో పడ్డారని, రక్షించేందుకు యత్నించినా సఫలం కాలేదని నటించాడు. తల్లి బావి వద్దకు చేరుకొని అరవడంతో గ్రామస్థులు వచ్చి శ్రీశైలంకు దేహశుద్ధి చేయగా పోలీసులు రక్షించారు. శ్రీశైలం అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై పారిపోయాడు. శ్రీశైలం తల్లిదండ్రులు, తమ్ముడిని కలిసి తమ పథకం ఫలించిందని చెప్పాడు. అందరూ కలిసి గోపాల్‌పూర్‌లోని ఉన్న వారి తాత ఇంట్లో తలదాచుకున్నారు. బాలికల తల్లి మౌనిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం గోపాల్‌పూర్‌లో నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు."

రూరల్ ఏసీపీ విజయకుమార్, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై లక్ష్మారెడ్డిలను సీపీ అభినందించారు

## గ్రామీణ మహిళల కోసం మగ్గం వర్క్ శిక్షణ ప్రారంభం



**మంథని ఏప్రిల్ 06, (జనోదయ):**
పెద్దపల్లి లోని (రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళల కోసం మగ్గం వర్క్ శిక్షణ బ్యాచ్ ప్రారంభమైంది. ఈ శిక్షణలో మొత్తం 35 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డి ఆర్ డి ఓ) ప్రాజెక్ట్ డైరెక్టర్ కాలిందిని హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదనంగా అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీందర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకట రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ మహిళలు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మగ్గం వర్క్ శిక్షణ ద్వారా ఇంటి వద్ద నుండే ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ పెద్దపల్లి డైరెక్టర్ పరిషా రాకేష్ మాట్లాడుతూ, ఈ శిక్షణలో మగ్గం వర్క్‌తో పాటు ఈడిపి (ఇంటర్ ప్రేనర్ షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాం) తరగతులు కూడా నిర్వహిస్తామని, దీని ద్వారా మహిళలు స్వయం ఉపాధి ప్రారంభించేందుకు అవసరమైన పూర్తి మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో (రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్) సిబ్బంది, శిక్షణార్థులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ




**జనోదయ, మంథని,, ఏప్రిల్ 06:**
కేంద్ర, రాష్ట్ర శాఖల ఆదేశాల మేరకు మంథని పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణ, మండల అధ్యక్షులు సబ్బాని సంతోష్, వీరబోయిన రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జెండా ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందజేశారు. అనంతరం పట్టణ వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించి పార్టీ నినాదాలు చేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండపాక సత్య ప్రకాష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బోగోజు శ్రీనివాస్ మాట్లాడుతూ, 1980 ఏప్రిల్ 6న స్థాపితమైన బీజేపీ ఏకాత్మ మానవతా వాదం, జాతీయ సమైక్యత వంటి సిద్ధాంతాలతో దేశసేవలో ముందంజలో ఉందన్నారు. పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యకర్తలు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చారిత్రక ఆలయానికి కేంద్రం నుంచి భారీ నిధులు

### -మరో కీలక మైలురాయి సాధించిన.. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

### -ఎంపీ డా. కడియం కావ్య పట్టుదలతో కాకతీయుల వైభవానికి పునర్జీవం



**వరంగల్ జిల్లా ప్రతినిధి: ఏప్రిల్ 06 (జనోదయ):**
వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మరో కీలక మైలురాయిని సాధించారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన హనుమకొండలోని రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల గుడి అభివృద్ధి కోసం కేంద్రం నుంచి భారీ నిధులు మంజూరు కావడంలో ఎంపీ డా.కడియం కావ్య కృషి ఫలించింది. వేయి స్తంభాల ఆలయం, అదే ప్రాంగణంలోని కల్యాణ మండపం అభివృద్ధి, విస్తరణతో పాటు మిగిలిపోయిన పునరుద్ధరణ పనుల కోసం రూ.14.44 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో ఎంపీ కడియం కావ్య కీలక పాత్ర పోషించారు. ఈ నిధులతో కాకతీయుల కాలంనాటి శిల్ప వైభవాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా పనులు చేపట్టనున్నారు. గతంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను పలుమార్లు కలిసి, వేయి స్తంభాల గుడి అభివృద్ధి అవసరాన్ని వివరిస్తూ.. ఎంపీ చేసిన నిరంతర ప్రయత్నాలే ఈ ఫలితానికి కారణం అయ్యాయి. గతంలో పురావస్తు శాఖ అధికారులతో కలసి స్వయంగా ఆలయాన్ని సందర్శించి, పునరుద్ధరణ అవసరాలను అధ్యయనం చేసిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వెంటనే కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఇటీవల కేంద్ర పురావస్తు శాఖ పనులకు టెండర్లు పిలవడంతో పనులు ప్రారంభానికి రంగం సిద్ధమైంది. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో పాటు పురావస్తు శాఖ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి, ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. గత ఏడాది కేంద్ర మంత్రిని కలసి సుమారు రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేసిన విషయం గుర్తు చేస్తూ.. అందుకు సానుకూలంగా స్పందించిన కేంద్రం రూ.14.44 కోట్లు కేటాయించడం వరంగల్ అభివృద్ధికి శుభసూచకమని పేర్కొన్నారు. కాకతీయుల శిల్ప కళా సంపదకు ప్రతీకగా నిలిచిన వేయి స్తంభాల గుడి అభివృద్ధి ద్వారా పర్యాటక రంగం మరింతగా అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. “వారసత్వాన్ని కాపాడుతూ అభివృద్ధి” అనే లక్ష్యంతో ముందుకు సాగుతూ వరంగల్ లో నూతన ప్రాజెక్టుల సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వరంగల్ ఎంపీ డా .కడియం కావ్య కు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

**-పలుమార్లు కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చివరకు ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు**

**-కేంద్ర మంత్రికి, పురావస్తు శాఖ అధికారులకు కృత-జ్ఞతలు తెలియజేసిన డా. కడియం కావ్య**

# రాష్ట్రంలోనే అత్యధిక అవార్డ్స్ సొంతం చేసుకున్న పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి

**జనోదయ మంథని ఏప్రిల్ -06:**
పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపును సాధించింది. వివిధ విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందిస్తూ ఈ ఆసుపత్రి పలు అవార్డులను సొంతం చేసుకుంది. రేపు హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా జిల్లా సూపరింటెండెంట్ డా. కొండా శ్రీధర్ ఈ అవార్డులను అందుకోనున్నారు. డా. కొండా శ్రీధర్ సూపరింటెండెంట్ కేటగిరీలో బెస్ట్ సూపరింటెండెంట్, అనస్థటిస్ట్, సివిల్ సర్జన్‌గా మొదటి అవార్డు అందుకోనున్నారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీ కేసుల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించినందుకు రెండవ అవార్డు దక్కనుంది. అలాగే టి హబ్ ద్వారా అత్యధిక రక్త పరీక్షలు నిర్వహించినందుకు మూడవ అవార్డు ఆయనకు లభించింది. ఇక రేడియాలజీ విభాగం తరపున అత్యధిక స్కానింగ్‌లు నిర్వహించినందుకు డా. సంధ్యా రాణి కూడా అవార్డు అందుకోనున్నారు. ఈ విజయంతో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచింది.



# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన "ఎమ్మెల్యే"

### -రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### -వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు

**వరంగల్ జిల్లా ప్రతినిధి: ఏప్రిల్ 06 (జనోదయ):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మార్క్‌ఫెడ్ సహకారంతో హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండల పరిధిలోని వంగపహాడ్, నాగారం గ్రామాలలో పాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మరియు కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి ఘనంగా ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పంటకు సరైన ధర లభించేలా ప్రభుత్వం ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే నాగరాజు రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులకు న్యాయమైన ధరలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. రైతులు పండించిన మొక్కజొన్న పంటకు మద్దతు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, మధ్యవర్తుల ద్వారా రైతులు నష్టపోకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకే పంటను తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. రైతుల సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే దేశం అభివృద్ధి సాధిస్తుందని, అందుకే రైతులకు అన్ని విధాలుగా అండగా నిలవడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఆయన వివరించారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో రైతులకు మేలు చేసే విధంగా అనేక నిర్ణయాలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. రైతులు పండించిన పంటకు సరైన మద్దతు ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా అధికారులకు సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

అలాగే కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు తాగునీరు, నీడ వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారి పక్షాన నిలబడి ప్రతి సమస్యను పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు.

అనంతరం గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గత వారం రోజులుగా ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శిక్షణ తరగతులు జరుగుతుండగా ముఖ్యఅతిథిగా పాఠశాలకు వెళ్లి వారితో సరదాగా గడిపి ఒక మొక్కను నాటి వారికి పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మార్క్‌ఫెడ్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, పాక్స్ ప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పోడు భూముల రైతులకు పట్టాలు ఇవ్వాలి

## కొండు బానేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

**జనోదయ ఆర్ సి చెన్నూర్ ఏప్రిల్ 06:** మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలోని బద్దం పెల్లి గ్రామంలో ఆదివాసి గిరిజన బలహీన వర్గాలకు సంబంధించిన పేద రైతులు భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న రని భూమిని ఆధారంగా చేసుకుని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న పేద రైతులకు పట్టాలు ఇవ్వాలని రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని పోడు భూముల విషయంలో పట్టాలిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఇంతవరకు ఇవ్వక పోవడం రైతుల పట్ల నిర్లక్ష్యం చేయడమేనని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని పట్టా పాసు పుస్తకాలు లేక పోవడం వలన (రైతు భరోసా) కు దూరం కావలసిన పరిస్థితి ఏర్పడిందని పంట రుణాలు పొందలేకపోతున్నారని బయట వారి దగ్గర అప్పులు తెచ్చుకొని సాగు వ్యవసాయానికి ఖర్చు చేస్తే పంట గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగు రైతులకు పట్టాలు ఇవ్వాలని లేని ఎడల రైతులతో కలసి పట్టాలు వచ్చే వరకు రైతులను కూడగట్టి పోరాడుతామని ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో అందే పురుషోత్తం సిపిఐ వేమనపల్లి మండల కార్యదర్శి, బోగారపు శంకర్ సిపిఐ వేమనపల్లి మండల సహాయ కార్యదర్శి, నరాల ప్రహ్లాద్ బి కే ఎం యు, జిల్లా సహాయ కార్యదర్శి, మానేపల్లి సమ్మయ్య రైతు సంఘం బద్దం పెల్లి గ్రామ అధ్యక్షులు, నాయిని గట్టయ్య రైతు సంఘం గ్రామ కార్యదర్శి కొండపల్లి వెంకటి, నరసింహ చారి, బురుస నాగయ్య, అరికెల భీమయ్య, తెల్లగ నారాయణ, తోకల హన్మంత్, తదితరులు పాల్గొన్నారు.



# పేద మహిళలకు అండగా కళ్యాణ లక్ష్మి

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.

## కళ్యాణలక్ష్మి–షాది ముబారక్ చెక్కుల పంపిణీ..



**జనోదయ,తొర్రూరు, ఏప్రిల్ 6:** పేద కుటుంబాల అమ్మాయిల వివాహాలకు ఆర్థికంగా అండగా నిలవడం కోసం ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు.

పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తొర్రూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకాల కింద చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 135 మంది లబ్ధిదారులకు కలిపి రూ.1,35,15,666 విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..ఈ పథకాల ద్వారా పేద కుటుంబాలపై పడే వివాహ ఖర్చు భారాన్ని తగ్గించడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు తమ కుటుంబాలను సంతోషంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, వివిధ గ్రామ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.

# మానేరును కొల్లగొడుతున్న ఇసుకాసురులు

## ఇసుక మాఫియాకు వరంగా మారిన ఇందిరమ్మ ఇళ్లు

### ఇసుక ట్రిప్పు 3 వేలు

### ప్రభుత్వ ఆదాయానికి గండి

**జనోదయ,మంథని, ఏప్రిల్ 06:**



మంథని మండలం గోపాల్ పూర్ నుంచి రేయింబవళ్లు ఇసుక అక్రమంగా తరలిపోతోంది. మంథనిలో ఇసుక బుకింగ్ పాయింట్ లేకపోవడం ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాలు కొనసాగడం అక్రమ ఇసుక రవాణా దారులకు వరంగా మారింది. మొన్నటివరకు విలోచవరం ఇసుక క్వారీ నుంచి ఇసుకను అక్రమంగా తరలించిన ట్రాక్టర్ యజమానులు ఫారెస్ట్ అధికారులు నిఘా ఎక్కువ కావడంతో రూటు మార్చారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని ఇసుక ట్రాక్టర్ ట్రిప్పు 3 వేలకు అమ్ముతున్నారు. దూరాన్ని బట్టి రేటు పెంచుతున్నారు. పదుల సంఖ్యలో రాత్రింబవళ్లు ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడంతో ఇసుకసురుల ఆగడాలకు అంతులేకుండా పోయింది. ఇసుకను పట్టపగలు బహిరంగంగానే తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అప్పుడప్పుడు పోలీసులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని ఫైన్లు వేసి వదిలేస్తున్నారు. మంథని మండలం సిరిపురం, గోపాల్ పూర్, కూచి రాజు పల్లి వద్ద ఇసుక డంపులు గుర్తించి స్వాధీనం చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. కొద్ది రోజులు ఇసుక తరలింపు ఆపి పోయిన చోటే వెతుక్కోవాలన్నట్లు మళ్లీ తమ దందాను కొనసాగిస్తున్నారు. గోపాల్ పూర్ మానేరులో స్థానిక కూలీలతో ఇసుకను నింపి ట్రాక్టర్లను అడవిలో నిరుపేసి తెల్లవారుజామునే లబ్ధిదారులకు నిరాటంకంగా చేరవేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా దారులు సెంట్రీలను ఏర్పాటు చేసుకొని తమ డ్రైవర్లకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నారు. ట్రాక్టర్ ఇంజన్ కు కానీ ర్యాలీకి గాని ఎలాంటి నెంబర్ ప్లేట్లు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. కొన్ని ట్రాక్టర్లకు సాండ్ బుకింగ్ అని రాసి ఉంటుంది. అక్రమ రవాణా కావడంతో లైసెన్స్ లేని మైనారిటీ తీరని యువకులకు డ్రైవింగ్ బాధ్యతలు అప్పగించడంతో అతివేగంగా ట్రాక్టర్ లను తోలి ప్రమాదాలకు కారకులవుతున్నారు. ఇందులో అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీ అనే తేడా లేకుండా అందరూ భాగస్వాములు అవుతున్నారు. గతంలో ముత్తారం మండలం, ఖమ్మం పల్లి (సందరెల్లి) మానేరు వద్ద నుంచి ఇసుకను తోడేసిన ఇసుక తోడేళ్లు ఇప్పుడు గోపాల్ పూర్ మానేరు నుంచి సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్న టిఎస్ఎండిసి అధికారులు గాని, ఆర్టీఏ అధికారులు గానీ ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీని తీసుకువచ్చి విధి విధానాలు రూపొందించి ఇసుక బుకింగ్ పాయింట్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు లబ్ధిదారులకు చౌకగా ఇసుక లభిస్తుంది. సంబంధిత జిల్లా అధికారులు ఇటువైపు దృష్టి సారించి ఇసుక అక్రమ తరలింపుకు అడ్డుకట్ట వేసి సాండ్ బుకింగ్ పాయింట్ ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదా








# గంగాధర గురుకుల పాఠశాల

## ప్రిన్సిపల్ సస్పెండ్



**గంగాధర ఏప్రిల్ 6 (జనోదయ):** గంగాధరలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో జరిగిన ర్యాగింగ్ ఘటనపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనలో 9వ తరగతి చదువుతున్న 11 మంది విద్యార్థులను 10వ తరగతి చదువుతున్న సుమారు 20 మంది విద్యార్థులు కొట్టిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జై సింగ్‌ను సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు. అలాగే గెస్ట్ టీచర్ రమేష్, నైట్ వాచ్‌మెన్ శంకర్‌ను ఉద్యోగాల నుంచి తొలగిస్తూ పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి సైదులు ఉత్తర్వులు జారీ చేశారు. రీజినల్ కోఆర్డినేటర్ సమర్పించిన విచారణ నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. బాధ్యులైన విద్యార్థులపై కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయాలని వారు కోరుతున్నారు.

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు

బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్

మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న

జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి

వాట్సాప్ చేయండి:8074124190




మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

# గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌పై సస్పెన్షన్ వేటు

జనోదయ గంగాధర ఏప్రిల్ 06: గంగాధరలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ర్యాగింగ్ కలకలంపై ఉన్నతాధికారులు స్పందించారు. 9వ తరగతి విద్యార్థులు 11 మందిని 10వ తరగతి విద్యార్థులు 20 మంది కొట్టడంపై గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జై సింగ్‌ను సస్పెండ్ చేయడం, గెస్ట్ టీచర్ రమేష్, నైట్ వాచ్‌మెన్‌ను శంకర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి సైదులు ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంపై రీజినల్ కోఆర్డినేటర్ విచారణ నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టారు.



# అధికారం కోల్పోయినా.. బిఆర్ఎస్ నాయకుల "దొర అహంకార ధోరణి"

© ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన -వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు

**వరంగల్ జిల్లా ప్రతినిధి: ఏప్రిల్ 06 (జనోదయ):**
వరంగల్ జిల్లా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ లో మార్క్‌ఫెడ్ సహకారంతో ఖిల్లా వరంగల్ ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మరియు అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.
రైతులు తమ పంటను సులభంగా విక్రయించుకునేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేయడం పట్ల ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటకు సరైన ధర లభించేలా ప్రభుత్వం ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు మార్కెట్ యార్డుకు తీసుకొచ్చే మొక్కజొన్న పంటను నాణ్యత ప్రమాణాల ప్రకారం కొనుగోలు చేసి, రైతులకు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ.. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. గత పాలకులు కాళేశ్వరం ప్రాజెక్టును ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా ఏటీఎంగా మార్చుకున్నారని విమర్శించారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వారు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అధికారాన్ని కోల్పోయిన తరువాత కూడా బీఆర్ఎస్ నాయకులు దొర అహంకారంతో మాట్లాడుతున్నారని, ప్రజల మధ్యకి వెళ్లి చూస్తే ఎవరు అభివృద్ధి చేశారో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి నెల మొదటి తారీకున ఉద్యోగులకు జీతాలు సమయానికి అందిస్తున్నామని, పెన్షన్లను కూడా సకాలంలో పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు.






రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై కూడా దృష్టి సారించి అధిక దిగుబడులు సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. పంటల సాగులో అధిక ఎరువులు, రసాయనాలు వాడడం వల్ల భూసారం దెబ్బతింటుందని తెలిపారు. ఇటీవల పారా క్విట్ డైక్లోరైడ్ అనే గడ్డి మందును బ్యాన్ చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్‌లోని అగ్రిటెక్ ఆవరణను సందర్శించిన ఎమ్మెల్యే నాగరాజు అక్కడ ప్రదర్శనలో ఉంచిన ఆధునిక వ్యవసాయ పరికరాలను పరిశీలించారు. రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించి వ్యవసాయంలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. అగ్రిటెక్‌లో అందుబాటులో ఉన్న పరికరాలు, యంత్రాల వివరాలను సంబంధిత ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా నాణ్యమైన వ్యవసాయ పరికరాలను అందుబాటులో ఉంచడంతో పాటు వీటిని అతి తక్కువ ధరలకు అందించాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# లాకప్ డెత్ కేసులో మదురై హైకోర్టు సంచలన తీర్పు..

## 9 మంది పోలీసులకు మరణశిక్ష

**జనోదయ జాతీయం ఏప్రిల్ 06:** 2020లో జరిగిన సాతన్‌కుళం కస్టడీ హత్య కేసును మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ సోమవారం అత్యంత ఘోరమైన, అమానుషమైన నేరంగా అభివర్ణించింది. కోర్టు ఈ ఘటనను అధికార దుర్వినియోగం, కస్టడీ హింస పరాకాష్ఠగా నిలిచే "అరుదైన నేరాల లోకెల్లా అరుదైనది"గా పేర్కొంది. ఈ నేపథ్యంలో, ఈ కేసులో నిందితులుగా నిలిచిన తమిళనాడు పోలీసు విభాగానికి చెందిన 9 మంది సిబ్బందికి మరణశిక్ష విధిస్తూ కీలక తీర్పును వెలువరించింది. ఈ తీర్పు దేశవ్యాప్తంగా కస్టడీ హింసపై జరుగుతున్న చర్చకు కొత్త మలుపు తీసుకొచ్చింది. సుమారు 6 ఏళ్ల పాటు సాగిన దీర్ఘకాలిక విచారణ అనంతరం, మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి జి. ముత్తుకుమారన్ ఈ తీర్పును ప్రకటించారు. వ్యాపారి పి. జయరాజ్ (59) మరియు అతని కుమారుడు జె. బెన్నిక్స్ (31) మరణానికి సంబంధించిన కేసులో, నిందితులైన 9 మంది పోలీసు సిబ్బందిని హత్య మరియు సంబంధిత ఇతర నేరాలకు దోషులుగా కోర్టు నిర్ధారించింది. కస్టడీలో చిత్రహింసలు సాధారణంగా జరిగిన ఘటనగా కాకుండా, ముందుగా ప్లాన్ చేసుకుని, రాత్రంతా నిరంతరంగా కొనసాగించారని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) పెట్టిన వాదనను కోర్టు పూర్తిగా సమర్థించింది. ఈ కారణంగా, ఇలాంటి అరుదైన కేసులో గరిష్ట శిక్ష విధించడం తప్పనిసరి అని కోర్టు స్పష్టం చేసింది. దోషులుగా తేలిన వారిలో సాతన్‌కుళం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీధర్, సబ్‌ఇన్‌స్పెక్టర్లు పి. రఘు గణేష్, కె. బాలకృష్ణన్ ఉన్నారు. వీరితో పాటు హెడ్ కానిస్టేబుళ్లు ఎస్. మురుగన్, ఎ. సమదురై మరియు కానిస్టేబుళ్లు ఎం. ముత్తురాజ్, ఎస్. చెల్లదురై, ఎక్స్. థామస్ ఫ్రాన్సిస్, ఎస్. వేలుముత్తు కూడా దోషులుగా తేలారు. ఈ కేసులో పదో నిందితుడైన స్పెషల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ పాల్దురై మాత్రం విచారణ జరుగుతున్న సమయంలో కోవిడ్19తో మృతి చెందడంతో, అతనిపై కేసు విచారణ మధ్యలోనే ముగిసింది. దీంతో మిగిలిన 9 మందిపై మాత్రమే కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసు 2020లో దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించిన ఘటనగా గుర్తింపు పొందింది. కోవిడ్19 లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించి తమ మొబైల్ యాక్సెసరీస్ దుకాణాన్ని తెరిచి ఉంచారనే ఆరోపణలపై, జయరాజ్ మరియు బెన్నిక్స్‌లను జూన్ 19న పోలీసులు అరెస్టు చేశారు. ఈ అరెస్టు తరువాత వారిని సాతన్‌కుళం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, అక్కడే నిరంతర చిత్రహింసలకు గురి చేసినట్లు దర్యాప్తులో బయటపడింది. దర్యాప్తు అధికారులు తరువాత సమర్పించిన వివరాల ప్రకారం, స్టేషన్ లోపల వారిపై మోతాదుకు మించిన దాడులు జరిగి, బలమైన దెబ్బలు, తీవ్రమైన రక్తస్రావం వంటి గాయాలు వాటిల్లాయి.






# అన్‌సైంటిఫిక్ స్పీడ్ బ్రేకర్లపై ఆగ్రహం: కరీంనగర్ ప్రజావాణిలో ఫిర్యాదు

- అన్‌సైంటిఫిక్ స్పీడ్ బ్రేకర్లతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు, వాహనాల నష్టం
- వెంటనే తొలగించాలని కరీంనగర్, జగిత్యాల ప్రజల డిమాండ్

**కరీంనగర్ : ఏప్రిల్ 06 (జనోదయ):**
కరీంనగర్ ప్రజావాణిలో రోడ్లపై ఉన్న శాస్త్రీయ ప్రమాణాలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లపై ఒక వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. అధికారికంగా ఆర్&బీ శాఖ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం అనధికారిక, అన్‌సైంటిఫిక్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయకూడదని స్పష్టంగా ఉన్నప్పటికీ, అనేక ప్రాంతాల్లో అవి యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

ఈ స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తరచూ "ధడ్.. ధడ్.." అనే శబ్దాలతో ప్రయాణం అసౌకర్యంగా మారుతోందని తెలిపారు. ముఖ్యంగా నడుము, మెడ నొప్పులు పెరుగుతున్నాయని, గర్భిణీలు, వృద్ధులు, రోగులు మరింత ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాలకూ నష్టం వాటిల్లుతోందని ఆయన పేర్కొన్నారు.






హైదరాబాద్ మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా నేషనల్ హైవేలు మరియు స్టేట్ హైవేల్లో ఉన్న ఈ అన్‌సైంటిఫిక్ స్పీడ్ బ్రేకర్లను వెంటనే తొలగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై సంబంధిత శాఖలు, ట్రాఫిక్ పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశానికి సంబంధించిన ఫోటోను సదరు వ్యక్తి సోషల్ మీడియా వేదికల్లో పంచుకోవడంతో దీనిపై విస్తృత చర్చ జరుగుతోంది. అనేక మంది తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ, ఇలాంటి అన్‌సైంటిఫిక్ స్పీడ్ బ్రేకర్ల వల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటున్నారు. ప్రత్యేకంగా కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని పలువురు వాహనదారులు చెబుతున్నారు. రోజువారీ ప్రయాణాల్లో ఈ స్పీడ్ బ్రేకర్లు కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయని, మరమ్మతులకు ఖర్చులు పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ప్రయాణ సమయంలో నడుము, మెడ నొప్పులు పెరుగుతున్నాయని, ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అంటున్నారు. ఈ సమస్యపై వెంటనే స్పందించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి స్పీడ్ బ్రేకర్లను గుర్తించి తొలగించాలని, రోడ్ల భద్రతకు అనుగుణంగా శాస్త్రీయ ప్రమాణాలతోనే వాటిని ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. ఈ ఫిర్యాదుపై అధికారులు ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

